సాక్షి నంద్యాల

శుక్రవారం । 3 । జనవరి । 2025



వర్గీకరణ చేయాలి.. కాదు..

ఎస్సీ వర్గీకరణపై ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి మాల, మాదిగ సంఘాల నాయకులు పోటాపోటీగా ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్‌మిశ్రాకు వినతులు అందజేశారు. 8లో▸



అతి వేగానికి ఇద్దరు బలి

కాసేపట్లో ఇంటికి చేరుకోవాల్సిన దంపతులను అతివేగం బలి తీసుకుంది. కోడుమూరు - కర్నూలు రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు దుర్మరణంచెందారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,625.85
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:79.312
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:110
అవుట్ ఫ్లో	:8,844

న్యూస్‌రీల్

పిల్లల వివరాలు ప్రశస్త యాప్‌లో నమోదు చేయండి



మాట్లాడుతున్న ఏపీసీ ప్రేమ్‌కాంత్

నంద్యాల(న్యూటౌన్): ప్రత్యేక అవసరాలు పిల్లల వివరాలను ప్రశస్త యాప్‌లో నమోదు చేయాలని సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రేమ్‌కాంత్ కుమార్ సూచించారు. భవిత సెంటర్ నిర్వహణ, పర్యవేక్షణపై జిల్లాలోని ఎంఈఓలకు గురువారం జిల్లా కేంద్రంలోని డిప్యూటీ ఈఓ కార్యాలయంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సదరన్ సర్టిఫికెట్ పొందే విధానం, ప్రత్యేక అవసరాలున్న పిల్లల సర్వే చేసే విధానంపై వివరించారు. బడిబయట ఉన్న పిల్లలందరని బడిలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో స్టేట్ కోఆర్డినేటర్ మల్లికార్జున, జిల్లా కోఆర్డినేటర్ రఘురామిరెడ్డి, డాక్టర్ కాంతరావు పాల్గొన్నారు.

నేడు జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్పీజీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఉంటుందని జిల్లా సైన్స్ అధికారి సుందరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన 8, 9 తరగతుల విద్యార్థులు హాజరై భౌతిక, రసాయన, జీవ శాస్త్రం, పర్యావరణం, కంప్యూటర్ విజ్ఞానం మొదలగు వినూత్న ఆలోచనలతో చక్కని సైన్స్ ప్రాజెక్టులు రూపొందించి ప్రదర్శించాలన్నారు. ప్రాజెక్టు తయారు చేసేటప్పుడు పర్యావరణ రహిత వస్తువులు ఉపయోగించాలన్నారు.

5న జిలా స్థాయి పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 5న శ్రీరామ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువజన సర్వీసుల శాఖ, ఇండియన్ రెడ్ క్రాస్ సహకారంతో జిల్లాస్థాయి వ్యాస రచన, వకృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు సెట్కూరు ముఖ్యనిర్వహణ అధికారి దీప్తి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వామి వివేకానంద జీవిత సందేశంపై వ్యాసరచన, సమాజ నిర్మాణంలో యువత పాత్రపై వకృత్వం, డ్రగ్స్ వ్యసనం దాని ప్రభావాలపై డ్రాయింగ్, చిత్రలేఖనం పోటీలు ఉంటాయన్నారు. 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయస్సు యువత పోటీల్లో పాల్గొనాలని, మరింత సమాచారం కోసం 9440516023 నంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు



పదోన్నతి పత్రం అందజేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలోని 11 మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించింది. గురువారం దేవస్థాన పరిపాలన భవనంలోని ఈఓ చాంబర్‌లో పదోన్నతులు పొందిన ఉద్యోగులకు ధ్రువీకరణ పత్రాలను దేవస్థాన ఈఓ ఎం.శ్రీనివాసరావు అందజేశారు. పదోన్నతులు పొందిన వారిలో ఎస్.అనురాధ, ఎం.చంద్రశేఖర రెడ్డి, పి.తారకచంద్రశేఖర్, ఏ.శ్రీనివాసులు, జె.శ్రీనివాసరెడ్డి, కె.శ్రీనివాసప్రసాద్, కె.నాగేంద్ర, కె.వి.రమణ, ఎం.రామానాయుడు, పి.శ్రీవిద్య, సి.గోవిందమ్మ ఉన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కార్యనిర్వహణాధికారి ఎం.రమణమ్మ, ఏఈఓ వెంకటేశ్వరరావు ఉన్నారు.

గుడి నిర్మాణానికి రూ.లక్ష విరాళం

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని జాతీయ రహదారి వద్ద నిర్మిస్తున్న షిర్డీ సాయిబాబా గుడి నిర్మాణానికి కృష్ణగిరి మండలం చిట్యాల గ్రామానికి చెందిన ఈడిగ లోకేశ్వరగౌడ్ గురువారం రూ.లక్ష విరాళం ఇచ్చారు. ముందుగా ఆయన ఆలయాన్ని సందర్శించి ఆలయ కమిటీ సభ్యులు భాష్యం రమణగౌడ్, ఓలేటి మాధవస్వామి, కందుకూరు పార్థు, సాయి, ధర్మారం సుబ్బారెడ్డి, సీఎం శ్రీను, మురళీకృష్ణగౌడ్, రామచంద్రుడులకు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు దాతను అభినందించి సత్కరించారు.



విరాళం నగదును అందజేస్తున్న దృశ్యం

పచ్చని పల్లెల్లో నాటు ఘాటు

పచ్చని పల్లెల్లో నాటు ఘాటు గుభాళిస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి నాటు సారా విచ్చలవిడిగా దొరుకుతోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ కష్టపడిన శ్రామికులు రాత్రి ఉపశమనం కోసం నాటు సారాను ఆశ్రయిస్తున్నారు. కల్తీ సారాను తాగి ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారు. ఒక్కోసారి పరిస్థితి విషమించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. నాటు సారా తయారీని అరికట్టాల్సిన ప్రభుత్వం కూటమి నేతల భయానికి తూతూ మంత్రంగా కేసులు నమోదు చేసి వదిలేస్తుండటంతో సారా వ్యాపారులు ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైంది.



అవుకులో సారా బట్టీల వద్ద బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు (ఫైల్)

- ఉపశమనం కోసం సారాకు బలవుతున్న మందుబాబులు
- జిల్లాలో పెరిగిపోతున్న నాటుసారా బట్టీలు
- గడిచిన 6 నెలల్లో 346 నాటుసారా కేసులు
- 10 వేల లీటర్లకు పైగా సారా స్వాధీనం
- పోలీసులు దాడులు చేస్తున్నా భయపడని సారా వ్యాపారులు

బొమ్మలసత్రం: జిల్లాలో పాణ్యం, బండిఆత్మకూరు, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, బనగానపల్లి, అవుకు, బేతంచర్ల, డోన్, నొస్సం, గాజులపల్లి తదితర ప్రాంతాల్లోని కొండల్లో నాటుసారా తయారు చేస్తున్నారు. సారా తయారు చేసే వారికి అక్కడ స్థానికంగా ఉన్న కూటమి నేతలే ముడిసరుకు విక్రయిస్తున్నారు. సారా తయారీ కోసం వాడే నల్ల బెల్లం, తుమ్మ చెక్క, పారం చెక్క, నవసారం, పాత చెప్పులు లాంటి ముడి సరుకును కూటమి నాయకులు విక్రయాలు చేపడుతున్నారు. సారా తయారీకి వాడే నల్లబెల్లాన్ని సైతం కూటమి నేతల ఇళ్లలో దాచి విక్రయాలు జరుపుతున్నారు. ముడి సరుకు విక్రయించినందుకు సారా తయారు చేసిన తర్వాత నాయకులు సారాను తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని వారికి అనుకూలంగా ఉన్న వ్యక్తుల ఇళ్ల ముందు గొయ్యి తీసి బండరాళ్లతో కప్పి పెడుతున్నారు. సారాను ప్యాకెట్ల రూపంలో తయారు చేసి అనుకూలంగా ఉన్న గ్రామాలకు తరలించి విక్రయాలు జరుపుతున్నారు.

కూటమి ప్రభుత్వం రాకతో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటుసారాను అరికట్టేందుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. సెబ్ అధికారులు విస్తృతంగా నాటు సారా స్థావరాలపై దాడులు చేసి, తప్పించుకున్న నిందితులను వెతికి పట్టుకుని జైలుకు పంపేవారు. గ్రామాల్లో సారా విక్రయించే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి నిందితుల్లో మార్పును తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంది. సారా తాగే వ్యక్తులకు దాని దుష్ప్రభావం ఎలా ఉండబోతుందో అవగాహన కల్పించి కొత్త జీవితాన్ని ప్రసాదించింది. సారా విక్రయించే వారికి ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకుని ప్రత్యేకంగా వ్యాపారులు చేసుకుని జీవించేందుకు చర్యలు తీసుకుంది. గ్రామ స్థాయి నుంచి పట్టణాల వరకూ ఎక్కడా నాటు సారా లేకుండా చర్యలు తీసుకుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన అనతి కాలంలోనే తిరిగి సారా బట్టీలు తెరుచుకున్నాయి. కూటమి నాయకులే సారా తయారు చేసే వారిని ప్రోత్సహించి వారికి కావాల్సిన అన్ని రకాల ముడి సరుకులు అందిస్తున్నారు. గతంలో సారా కేసుల్లో ఉండి సాధారణ జీవితం గడుపుతున్న వారిని పిలిపించి మీపై తిరిగి కేసులు పెట్టిస్తామని బెదిరించి బట్టీలకు పంపుతున్నట్లు గ్రామాల్లో చర్చించుకుంటున్నారు. ఎక్కడ తమపై తప్పుడు కేసులు నమోదు చేయిస్తారేమోనన్న భయంతో కొంత మంది అమాయకులు కూటమి నాయకులు చెప్పినట్లుగా బట్టీలు తెరిచి సారా తయారు చేస్తున్నారు.

6 నెలల్లో 346 నాటుసారా కేసులు

వైఎస్సార్‌సీపీ పాలన అనంతరం కూటమి ప్రభుత్వం వచ్చిన అనతి కాలంలో నాటుసారా విక్రయాలు పెరిగిపోయాయి. 2024 జులై నుంచి నవంబర్ నెల వరకు 6 నెలల్లో 346 నాటుసారా కేసులు నమోదయ్యాయి. జూన్ నెలలో 58 కేసులకు గాను 33 మందిని పోలీసులు అరెస్ట్ చేసి 1,094 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. జులైలో 58 కేసులకు గాను 1,095 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఆగస్టులో 42 కేసులకు గాను ఇద్దరిని అరెస్ట్ చేసి 365 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. సెప్టెంబర్‌లో 51 కేసులకు గాను 29 మందిని అరెస్ట్ చేసి వారి నుంచి 412 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అక్టోబర్‌లో 66 కేసులు నమోదు కాగా 35 మందిని అరెస్ట్ చేసి 744 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. నవంబర్‌లో 65 కేసులకు గాను 867 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. కాగా కేసులు నమోదు చేస్తున్నా .. అధికార పార్టీ నాయకుల అండదండలతో సారా వ్యాపారులు ఎలాంటి భయం లేకుండా తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి.



కొలిమిగుండ్లలోని ఓ ఇంటి ముందు గుంతలో దాచిఉంచిన నాటుసారాను బయటకు తీస్తున్న దృశ్యం (ఫైల్)

ఇంటి వద్దే సారా గుంత..

ఈ చిత్రంలోని ఎక్సైజ్ పోలీసులు... వాళ్ల చేతిలో సారా బకెట్లు. గుంతలో నుంచి తీస్తున్నారెందుకనేగా మీ అనుమానం. కొలిమిగుండ్లకు చెందిన ఎరుకలి గంగయ్య, ఎరుకలి ఆది కొన్నేళ్లుగా నాటుసారా వ్యాపారం చేస్తున్నారు. వీరికి కూటమి నేతల అండదండలు పుష్కలంగా ఉన్నాయి. అందుకే సమీపంలోని కొండలో నాటు సారా తయారు చేయించి వారి ఇంటి ముందు గుంత తవ్వి బకెట్లలో దాచి పెట్టారు. గత నెల 6న గంగయ్య, ఆది ఇళ్లలో ఎక్సైజ్ పోలీసుల సోదాలు చేసి 220 లీటర్ల సారాను బయటకు తీసి నిందితులిద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఒకే రోజు 1,400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

గడివేముల మండలం వైకే తండా శివారులోని కొండ ప్రాంతంలో నాటుసారా తయారు చేస్తున్నారన్న సమాచారంతో ఎక్సైజ్ అధికారులు గత నెల 21న సోదాలు నిర్వహించారు. అక్కడికి పోలీసులు వస్తున్నారన్న సమాచారంతో నిందితులు ముందుగానే పరారయ్యారు. పోలీసులు సారా తయారీకి నిల్వ ఉంచిన 1,400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. కాగా సారా తయారు చేసి ఇతర గ్రామాలకు తరలించేది అక్కడ కూడా కూటమి నాయకులేనని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఉసురు తీసిన సారా



ఇక్కడ కనిపిస్తున్న మృతదేహం.. కొలిమిగుండ్ల మండలం మీర్జాపురం గ్రామానికి చెందిన పిక్కిలి నాగన్న(65)ది. ఈయన గతంలో వ్యవసాయ కూలీగా పనిచేసేవాడు. ఇటీవల నాపరాతి గనుల్లో రోజువారి కూలీకి వెళ్తుండేవాడు. పని చేసి అలసిపోయినన అతడు గత నెల 12 గ్రామంలోని కూటమి నాయకుడి సారా కొట్టు వద్దకు వెళ్లి కల్తీ సారా తాగాడు. కాసేపటికే అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. కుటుంబ పెద్ద సారాకు బలి కావటంతో ప్రస్తుతం ఆ కుటుంబాన్ని ఆదరించే దిక్కులేక అవస్థలు పడుతోంది.

యథేచ్ఛగా కొనసాగుతున్న విక్రయాలు

జిల్లాలో సారా విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతుండటం పోలీసుల దాడుల్లో నమోదవుతున్న కేసులను చూస్తే ఇట్టే అర్థమవుతుంది. కొండ ప్రాంతాల్లో సారా తయారీకి బట్టీలు ఇష్టానుసారంగా తెరుకోవటంపై పోలీసులను నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతోంది. గ్రామాల్లో సారా విక్రయాలు పక్కనపెడితే ఏకంగా జిల్లా కేంద్రంలో సారా విక్రయాలు జరుగుతున్నా పట్టించుకోకపోవటం గమనార్హం. జిల్లా ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఏకలవ్య నగర్, దేవనగర్, బొగ్గులైన్, బొమ్మల సత్రం లాంటి ప్రాంతాల్లో నేటికీ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అలాగే జిల్లా కేంద్రంలో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెనుక ఉన్న హరిజన వాడలో కూడా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సమీపంలోని కుందూనది ప్రాంతంలో సారా బట్టీల నుంచి సారా తయారు చేసి హరిజన వాడకు చెందిన ఒక కూటమి నాయకుడి అండతో ప్రతి రోజు విక్రయాలు జరుపుతున్నారు. ఫిర్యాదులు అందినప్పుడుమాత్రమే తూతూ మంత్రంగా దాడులు చేసి 10 నుంచి 20 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ప్రచారం చేసుకోవటంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు



జిల్లాలో నాటుసారా స్థావరాలపై ప్రత్యేక నిఘా ఉంచి బట్టీలను ధ్వంసం చేస్తున్నాం. నాటుసారా తయారు చేసినా లేదా విక్రయించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తాం. కేవలం 6 నెలల వ్యవధిలో దాదాపుగా 350 కిపైగా కేసులు నమోదు చేశాం. ఎవరైనా సారా విక్రయాలు జరిపితే వెంటనే స్థానిక ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందించాలి.

– రవికుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, నంద్యాల జిల్లా

వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ నియామకం



బొమ్మలసత్రం: వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీని ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ప్రకటించారు. జిల్లా వైస్‌ప్రెసిడెంట్‌లుగా సద్దల సూర్యనారాయణరెడ్డి (పాణ్యం), షేక్ అమీర్‌బాషా (నంద్యాల), దేసం పెద్ద నాగలక్ష్మిరెడ్డి(శ్రీశైలం), తలారి రామచంద్రుడు (డోన్), బి.మహేశ్వరరెడ్డి (బనగానపల్లె), రమేష్ నాయుడు(నందికొట్కూరు), బి.అబ్దుల్ సలామ్(ఆళ్లగడ్డ)లను నియమించారు.

- జనరల్ సెక్రటరీలుగా మేరువ సోమశేఖర్ రెడ్డి (నంద్యాల), అవదానం జయకృష్ణ (శ్రీశైలం), లక్కిరెడ్డి వెంకటసుధాకర్ రెడ్డి (బనగానపల్లె), కోసిక తిరుమలేశ్వరరెడ్డి (నందికొట్కూరు), డి.సోమశేఖర్ రెడ్డి (ఆళ్లగడ్డ)లను నియమించారు. ట్రెజరర్‌గా జి.సుమంత్ కుమార్‌రెడ్డి (పాణ్యం)ను నియమించారు.
- సెక్రటరీ ఆర్గనైజేషన్ సభ్యులుగా ఏరాసి శ్రీనాథ్‌రెడ్డి (పాణ్యం), వై. రఘుమాధవరెడ్డి (పాణ్యం), కోడూరు రామచంద్రారెడ్డి (బనగానపల్లె), అల్లె సురేష్‌రెడ్డి (బనగానపల్లె), బండి రమణయ్య (శ్రీశైలం), కె.నాగేశ్వరరెడ్డి (శ్రీశైలం), కె. భాస్కర్‌రెడ్డి (డోన్), కె.హరిప్రకాష్(డోన్), ఎమ్.నాగసేనారెడ్డి(నందికొట్కూరు), షేక్ మహమ్మద్‌గౌస్ (నందికొట్కూరు), జి. వెంకటసుబ్బారెడ్డి (ఆళ్లగడ్డ), బి.నాగేశ్వరరావు(ఆళ్లగడ్డ), పటాన్ అజ్మీర్‌ఖాన్(నంద్యాల), లగుమరపు హరిప్రసాద్ (నంద్యాల)లను నియమించారు.
- సెక్రటరీ ఆక్టివిటీ సభ్యులుగా సద్దల శ్రీనివాసరెడ్డి (పాణ్యం), ఎల్లంపల్లి రాంభూపాల్‌రెడ్డి(పాణ్యం), ముక్కమల్ల పుల్లారెడ్డి (బనగానపల్లె), అన్నమ్ బాబు (బనగానపల్లె), కోలా సుబ్బారావు (శ్రీశైలం), షేక్ మహమ్మద్ బాషా(శ్రీశైలం), ఎస్.శ్యామ్‌సుందర్‌రెడ్డి (డోన్), బి. సీతారామచంద్రుడు (డోన్), డి. ఉపేంద్రారెడ్డి (నందికొట్కూరు), కాటం వెంకటరమణ (నందికొట్కూరు), ఎస్.ప్రభాకర్ (ఆళ్లగడ్డ), పి.నారాయణ (ఆళ్లగడ్డ), సీలం శివనాగిరెడ్డి (నంద్యాల), ముక్కమల్ల అశోక్‌రెడ్డి (నంద్యాల)లను నియమించారు.
- అఫీషియల్ స్పోక్స్ పర్సన్స్‌గా పోగుల చంద్రశేఖర్‌రెడ్డి (పాణ్యం), సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి (బనగానపల్లె), కె.మహేశ్వరరెడ్డి (శ్రీశైలం), పుసులూరు మురళీకృష్ణ(డోన్), కె.నాగార్జున్ రెడ్డి (నందికొట్కూరు), అమృతరాజ్ (నంద్యాల), ఏ.శివరామకృష్ణరెడ్డి (ఆళ్లగడ్డ)లను నియమించారు.

మూడో రోజు 204 మంది ఎంపిక



పోలీస్ కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియలో భాగంగా లాంగ్‌జంప్‌లో పాల్గొన్న అభ్యర్థులు

కర్నూలు: కానిస్టేబుల్ నియామకానికి సంబంధించిన దేహదారుఢ్య పరీక్ష ప్రక్రియ గురువారం మూడో రోజుకు చేరింది. 600 మంది అభ్యర్థులకు గాను 283 మంది బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. అభ్యర్థుల అర్హత పత్రాల పరిశీలన, బయోమెట్రిక్, శారీరక కొలతలు పరిశీలించారు. అందులో అర్హత సాధించిన వారికి 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు. వాటిలో 204 మంది ప్రతిభను కనపరచి తుది రాత పరీక్షకు ఎంపికయ్యారు. ఏదైనా సమస్యలు, కారణాలతో అప్పీల్ చేసుకున్న అభ్యర్థులు జనవరి 28న హాజరుకావాలని పోలీసు అధికారులు తెలిపారు.

నేడు మహిళా అభ్యర్థులకు...

3, 4 తేదీల్లో మహిళా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ జరగనుంది. రోజుకు 739 మంది చొప్పున హాజరుకానున్నాయి. బరువు 30 కిలోలు, ఎత్తు 150 సెం.మీ ఉండాలి. 1600 మీటర్ల పరుగును 10.30 నిముషాలు, 100 మీటర్ల పరుగును 18 సెకన్లు, లాంగ్‌జంప్ 2.75 మీటర్లు పూర్తి చేయాలి. వీటిలో ఉత్తీర్ణులైనవారు తుది రాత పరీక్షకు అర్హత సాధిస్తారు.

భూముల రీసర్వేతో ఇబ్బందుల తొలగింపునకు చర్యలు



కానాలలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): భూముల రీ సర్వేతో ఇబ్బందుల తొలగింపుకు చర్యలు చేపడుతున్నామని సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ జయరాజు అన్నారు. రీసర్వే పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన మండలంలోని కానాల గ్రామంలో రీ సర్వేపై రైతుల అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు 20 సర్వే నంబర్లకు సంబంధించిన పొలాల రీ సర్వే సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఐటీఎస్ కృష్ణకుమార్, డీటీలు రామచంద్రరావు, నాగరాజు, సర్వేయర్ శివప్రసాద్, వీఆర్‌ఓ ప్రియాంక పాల్గొన్నారు.

నాడు- నేడుకు 'చంద్ర'గ్రహణం..!

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేసింది. నాడు- నేడు మనబడి కార్యక్రమం ద్వారా సర్కార్ బడుల రూపురేఖలు మార్చేసింది. విద్యా ప్రమాణాలు మెరుగుపరిచి కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలలకు సకల హంగులు కల్పించింది. కానీ కూటమి ప్రభుత్వంలో నాడు-నేడు పనులకు 'చంద్ర'గ్రహణం పట్టింది. ఫలితంగా 973 ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కడికక్కడే పనులు నిలిచిపోయాయి. పనులు పూర్తయితే గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పేరొస్తుందనే దురుద్దేశంతో ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం అభివృద్ధి పనుల పురోగతికి మోకాలడ్డారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

– కోవెలకుంట్ల

- జిల్లాలో రెండో విడతలో 973 పాఠశాలలు ఎంపిక
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.366 కోట్లు మంజూరు
- సర్కారు బడులపై కూటమి సర్కార్ కక్ష
- నాడు- నేడుకు పైసా విదిల్చని వైనం
- జిల్లాలో ఎక్కడికక్కడే నిలిచిపోయిన పనులు

జిల్లా వ్యాప్తంగా 1,213 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 1.75 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. నాడు-నేడు మనబడి కార్యక్రమం కింద గత ప్రభుత్వం మొదటి విడతలో 486 పాఠశాలలు ఎంపిక చేసి రూ.117 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేసింది. ఏడాదిన్నర క్రితం రెండవ విడతలో 973 పాఠశాలలు ఎంపిక చేసి రూ.366 కోట్లు కేటాయించి ఆయా పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టింది. సర్కారు బడులను అధునాతనంగా తీర్చిదిద్ది కార్పొరేట్‌కు దీటుగా వసతులు కల్పించింది. ఇంగ్లీష్ మీడియం, ఐఎఫ్‌పీ ప్యానల్, డిజిటల్ విధానంలో బోధన, టోఫెల్ విధానంలో పరీక్షలు, సీబీఎస్ఈ సిలబస్, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసింది. 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు అమ్మఒడి, విద్యాకానుక, గోరుముద్ద తదితర పథకాలు అందించింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు గదులు, తరగతి గదుల మరమ్మతులు, తాగునీరు, బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లు, తదితర మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీట వేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు తెలుగు మీడియంతోపాటు ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన కొనసాగించింది.

కూటమి రాకతో నిలిచిన రెండో విడత పనులు

రెండవ విడతలో జిల్లాలో ఎంపికైన పాఠశాలల్లో నాడు-నేడు పనులు స్తంభించాయి. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రిగా నారా లోకేష్ ఉండి విద్యారంగాన్ని పూర్తిగా గాలికొదిలేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లాలో రెండో విడతలో 973 ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలను ఎంపిక చేసి వీటిల్లో మౌలిక వసతులు, అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.366 కోట్లను మంజూరు చేసింది. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ నాటికి దాదాపు 70 శాతం మేర పనులు పూర్తయ్యాయి. ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ప్రభుత్వ పాఠశాలల్లో పనులు నెమ్మదించాయి. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయం సాధించి అధికారం చేపట్టింది. ఏడు నెలలు కావస్తున్నా పెండింగ్ పనులకు పైసా నిధులు విడుదల చేయలేదు. ఈ ఏడు నెలల్లో ఒక్కసారి కూడా నాడు-నేడు పనులపై సమీక్ష లేదంటే ఈ ప్రభుత్వానికి సర్కార్ బడులంటే ఎంత నిర్లక్ష్యమో అద్దం పడుతోంది. రాష్ట్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడటంతో అటు పేరెంట్స్ కమిటీలు, ఇటు హెచ్‌ఎం, ఇంజినీరింగ్ అధికారులు పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనను పూర్తిగా వదిలేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



గత ప్రభుత్వ హయాంలో కోవెలకుంట్ల జెడ్పీ హైస్కూల్‌కు అన్ని హంగులు కల్పించిన దృశ్యం



మధ్యలో నిలిచిపోయిన సంజామల కేజీబీవీ అదనపు తరగతి గదుల నిర్మాణం

విద్యార్థులకు తప్పని తిప్పలు

కూటమి ప్రభుత్వం మిగిలిపోయిన పనులపై దృష్టి సారించకపోవడంతో పాఠశాలల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం, సీబీఎస్ఈ, టోఫెల్ పరీక్ష విధానం తదితర వాటికి కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. ఈ నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరం పూర్తయ్యే నాటికైనా మిగిలిపోయిన నాడు- నేడు పనులు పూర్తి చేస్తారా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసి విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి



నాడు-నేడు మనబడి కార్యక్రమం ద్వారా నిలిచిపోయిన పనులకు నిధులు కేటాయించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలి. ఆయా పాఠశాల్లో నిలిచిపోయిన అదనపు తరగతిగదుల నిర్మాణం, మరుగుదొడ్లు, బాత్‌రూంలు, వంటగది నిర్మాణ పనులను పునఃప్రారంభించి సర్కారు బడులకు పూర్వ వైభవం తీసుకురావాలి.

– దినకర్, వల్లంపాడు, కోవెలకుంట్ల మండలం

విద్యారంగాన్ని విస్మరించొద్దు



కూటమి ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తే ఆందోళనలు చేపట్టడానికి వెనుకాడం. జిల్లాలో నిలిచిపోయిన నాడు-నేడు పనులకు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలి. పేద, మధ్య తరగతి కుటుంబానికి చెందిన వారే వారి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించి చదువులు చెప్పిస్తున్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.

– మాబు ఉసేన్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు, కోవెలకుంట్ల

క్లుప్తంగా

కంది పంటకు నిప్పు



పూర్తిగా దగ్ధమైన కంది పంట

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ బుక్కాపురం గ్రామానికి చెందిన వేర్పుల పెద్ద మద్దమ్మ కుమారుడు నాగ మద్దయ్య పండించిన కంది పంటకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. గత నెల 31న కంది పంటను కోత కోశాడు. గురువారం ఉదయం పొలానికి వెళ్లి చూడగా పంట పూర్తిగా కాలిపోయి ఉండటం చూసి గుండెలు బాదుకున్నాడు. 3 ఎకరాల పంట దిగుబడి చేతికొస్తుందన్న ఆశతో ఉన్నానని, గిట్టని వారు నిప్పు పెట్టడం వల్ల రూ.1.70 లక్షల మేర నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయాడు.

యువకుడి అదృశ్యం



సాంబశివుడు (ఫైల్)

జూపాడుబంగ్లా: మండలంలోని తూడిచెర్ల గ్రామానికి చెందిన నల్లబోతుల సాంబశివుడు (27) అదృశ్యమైనట్లు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలు.. తూడిచెర్ల గ్రామానికి చెందిన గ్రామానికి చెందిన నల్లబోతుల పుల్లయ్యకు వియకుడు, సాంబశివుడు కుమారులు. గత నెల 30న సాంబశివుడు ట్రాక్టర్‌ను వరిమడిలో నుంచి తీసుకెళ్తుండగా తండ్రి పుల్లయ్య, అన్న విజేయుడు మందలించారు. ఈ విషయమై అలిగి ఇంటికి రాకుండా ఎటో వెళ్లిపోయాడు. రెండు రోజులైనా ఇంటికి రాకపోవడంతో సోదరుడు విజేయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోయిలకొండ సమీపాన చిరుత సంచారం

కృష్ణగిరి: మండల పరిధిలోని కోయిలకొండ గ్రామ శివారులో చిరుత సంచరిస్తున్నట్లు గ్రామ ప్రజలు తెలిపారు. గ్రామ సమీపంలోని నల్లకొండ దగ్గర శంకన్న అనే రైతు పొలం వద్ద చిరుత.. కుక్కను తిన్న ఆనవాళ్లను గమనించారు. ఈ గ్రామ సమీపంలోని కటారుకొండ గ్రామ శివారులో కూడా గతేడాది జూలై నెలలో జింకను చిరుత తిన్న ఆనవాళ్లను, చిరుతను కొందరు చూశారు. ఫారెస్టు అధికారులు స్పందించి చిరుత నుంచి తమకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరారు.

మాజీ భర్తపై వేధింపుల కేసు

బేతంచెర్ల: స్థానిక దుర్గాపేట కాలనీకి చెందిన జామ్ జగ్గుల నీలావతి ఫిర్యాదు మేరకు మాజీ భర్త నంద్యాలకు చెందిన విజయ్‌పై పోలీసులు వేధింపుల కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాలు.. విజయ్, నీలావతి 2023లో విడాకులు తీసుకున్నారు. కాగా బుధవారం రాత్రి మద్యం తాగి వచ్చి తనతో సంసారం చేయడానికి రావాలని, లేకపోతే చంపుతానని బెదిరింపులకు పాల్పడ్డాడని బాధితురాలు నీలావతి పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గురువారం తెలిపారు.

వ్యక్తిపై హత్యాయత్నం

శ్రీశైలంప్రాజెక్ట్: సోదరిని వేధిస్తున్నాడనే కారణంతో ఓ వ్యక్తిపై ముగ్గురు వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడినట్లు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. సీఐ చంద్రబాబు తెలిపిన వివరాలు.. సున్నిపెంట గ్రామానికి చెందిన నన్నేసాహెబ్ అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. కాగా ఇటీవల తనను నన్నేసాహెబ్ హింసిస్తున్నాడని మహిళ తన సోదరులు మౌలాలి, శాలు, శివల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో బుధవారం రాత్రి ముగ్గురు సోదరులు కలిసి బస్టాండ్ సమీపంలో నన్నేసాహెబ్‌పై దాడి చేశారు. గునపంతో బాదడంతో తలకు తీవ్ర గాయం కాగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం మార్కాపురం తరలించామని సీఐ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

వర్గీకరణ చేయాలి.. కాదు, ఆ తీర్పు రద్దు కావాలి!

ఏకసభ్య కమిషన్‌కు పోటాపోటీగా మాల, మాదిగల వినతులు

- తమను ఎస్సీలుగా గుర్తించాలని బేడ, బుడగ జంగాల వినతి
- కమిషన్‌ను కలవకుండా మదాసి/మాదారి కురువల అడ్డగింత
- ఎస్సీ కులాల వారీగా విద్య, ఉపాధి, సామాజిక, ఆర్థిక వివరాలివ్వండి
- అధికారులను ఆదేశించిన కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా



ఎస్సీ వర్గీకరణ కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రం ఇస్తున్న జిల్లా మాదిగ కుల సంఘాల నాయకులు



రాజీవ్ రంజన్ మిశ్రాకు వినతిపత్రం ఇస్తున్న జిల్లా మాల కుల సంఘాల నాయకులు

కర్నూలు (సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఎస్సీ వర్గీకరణపై ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి ఆయా కులాల అభ్యంతరాలు, సలహాలు, సూచనలపై గురువారం వినతులను స్వీకరించారు. షెడ్యూల్ కులాల్లోని ఉపకులాలైన మాదిగలు, మాలలు పోటాపోటీగా వీటిని సమర్పించారు. ఎస్సీ వర్గీకరణ చేసి విద్య, ఉపాధి, ఉద్యోగాల్లో సమన్యాయం చేయాలని మాదిగలు పెద్దఎత్తున కమిషన్‌కు అందజేశారు. అలాగే, క్రిమిలేయర్‌ను వర్తింపజేయాలని, 59 ఉప కులాలకు సమన్యాయం జరగాలంటే వర్గీకరణ ఒక్కటే మార్గమని సూచించాయి. కానీ, వర్గీకరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని మాల సంఘాలు నివేదించాయి. ఇందుకోసం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రద్దుచేయాలని, క్రిమిలేయర్‌ను అమలుచేయకూడదని డిమాండ్ చేశాయి. అలాగే, 2008 వరకు ఎస్సీ సర్టిఫికెట్లను పొందిన తమకు అనుకోకుండా ఆ తరువాత ఎస్సీ రిజర్వేషన్‌ను తీసేశారని, దానిని పునరుద్ధరించాలని బేడ, బుడగ జంగాలు వినతిపత్రం సమర్పించారు. ఇక ఎస్సీ జాబితాలో ఉన్న తమకు ఎస్సీ కుల సర్టిఫికెట్లను జారీచేసేందుకు చర్యలు తీసుకోవాలని మాదాసి/మదారి కురువ సంఘాల నాయకులూ కోరారు. కాగా ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఎస్సీ జాబితాలో అన్ని ఉపకులాల ఆర్థిక, రాజకీయ, సామాజిక, విద్య, ఉద్యోగ వివరాలివ్వాలని ఏకసభ్య కమిషన్ రాజీవ్ రంజన్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ పి. రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి. నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టిన మదాసి/మదారి కురువ సంఘం నాయకులు

మదాసి/మదారి కురువల ఆందోళన..

మదాసి/మదారి కురువలకు ఎస్సీ సర్టిఫికెట్‌ను జారీచేయాలని కోరుతూ కమిషన్‌కు విన్నవించేందుకు ఆ సంఘం నాయకులు వెళ్లగా వారిని కొందరు ఎస్సీ నేతలు అడ్డుకున్నారు. బీసీలుగా ఉన్న మదాసి/మదారి కురువలను ఎస్సీలుగా ఎలా గుర్తిస్తారని అడ్డుకోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దీంతో వారు అక్కడి నుంచి వచ్చి కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. తమను ఎస్సీలుగా గుర్తించాలని.. తమ వినతులను కమిషన్ స్వీకరించాలని ఏపీ మదారి/మదాసి కురువ సంఘం నేత కేఎల్ సోమలింగ డిమాండ్ చేశారు. తమను కమిషన్‌ను కలవకుండా అడ్డుకోవడం అన్యాయమన్నారు.

రిజర్వేషన్లను పెంచితే వర్గీకరణ అక్కర్లేదు..

తక్షణమే ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను నిలిపివేయాలి. రాష్ట్రంలో కుల గణన చేసి ఎస్సీ రిజర్వేషన్ శాతాన్ని 15 నుంచి 23కు పెంచితే వర్గీకరణ చేయాల్సిన అవసరంలేదు. క్రిమిలేయర్‌ను వర్తింపజేస్తే ఎస్సీలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది.

– రాయలసీమ మాల మహానాడు నాయకులు యాట ఓబులేసు, మాధవస్వామి, రాజశేఖర్

విద్యా, ఉద్యోగాల్లో సమన్యాయం కోసమే వర్గీకరణ..

ఎస్సీ వర్గీకరణతో అన్ని ఉప కులాలకు సమన్యాయం జరుగుతుంది. విద్య, ఉద్యోగాల్లో సమన్యాయం జరిగి అందరికీ సమాన అవకాశాలు వస్తాయి. ఎస్సీలోని 59 ఉప కులాలకు న్యాయం జరుగుతుంది. క్రిమిలేయర్‌ను వర్తింపజేయడం ద్వారా ఇంతవరకు లబ్ధిపొందని వారు కూడా లబ్ధిపొందే అవకాశం ఉంది. కాబట్టి, ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి.

– ఎమ్మార్పీఎస్ నేతలు దోస్ ఈశ్వర్, దండు వీరయ్య, సుభాష్ చంద్రబోస్

అతి వేగానికి ఇద్దరు బలి

- రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం



మృతిచెందిన రామగోవిందు, వరలక్ష్మి (ఫైల్)



నుజ్జునుజ్జు అయిన కారు

కోడుమూరు రూరల్: కాసేపట్లో ఇంటికి చేరుకోవాల్సిన దంపతులను అతివేగం బలి తీసుకుంది. కోడుమూరు – కర్నూలు రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు దుర్మరణం చెందారు. కోడుమూరుకు చెందిన రామగోవిందు (56), వరలక్ష్మి(50)కి కుమార్తె, కుమారుడు ఉన్నారు. రామగోవిందు బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీస్‌లో గత 20 ఏళ్లుగా ఉద్యోగం చేస్తున్నాడు. పిల్లలిద్దరికీ వివాహాలు చేశారు. వరలక్ష్మికి అనారోగ్యంగా ఉండటంతో గురువారం హెల్త్ చెకప్ నిమిత్తం దంపతులు బైక్‌పై కర్నూలుకు వెళ్లారు. అక్కడ చెకప్ పూర్తయిన తర్వాత ఇంట్లో ఉన్న కుమార్తెకు ఫోన్ చేసి తిరిగి బయలుదేరుతున్నామని చెప్పారు. అయితే మరో పది నిమిషాల్లో ఇంటికి చేరుకోవాల్సిన వారిని మృత్యువు పొట్టన పెట్టుకుంది. మార్గమధ్యలో కొత్తూరు – ప్యాలకుర్తి గ్రామాల మధ్య ఎమ్మిగనూరు నుంచి నంద్యాల వెళ్తున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు రామగోవిందు, వరలక్ష్మి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందారు. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. విషయం తెలుసుకున్న కోడుమూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం మృతదేహాలను పోస్టుమార్టమ్ నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాసేపట్లో ఇంటికి చేరుకోవాల్సిన దంపతులు విగతజీవులుగా తిరిగిరావడంతో కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బోరు బావిలో పైపులు దించుతుండగా ప్రమాదం

- పేలుడు సంభవించి ముగ్గురికి గాయాలు



చికిత్స పొందుతున్న జయరామ్

ఆదోని అర్బన్: చిన్నపెండేకల్ గ్రామంలో ఓ రైతు పొలంలోని బోరు బావిలో పైపులు దించుతుండగా అకస్మాత్తుగా పేలుడు సంభవించి ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామానికి చెందిన చెందిన రైతు చంద్రయ్యకు రెండున్నర ఎకరాల పొలం ఉంది. మిరప సాగు చేస్తున్నాడు. కాగా పాత బోరులో నీటి నిల్వలు తగ్గిపోవడంతో రెండు నెలల క్రితం కొత్త బోరు తవ్వించారు. కాగా చంద్రయ్య, భార్య పుష్పావతి గురువారం బోరు బావిలో పైపులు దింపుతుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించింది. దీంతో అక్కడే ఉన్న దంపతులతో పాటు మరో వ్యక్తి జయరాజ్ ముఖాలు, శరీరానికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పక్క పొలంలో పని చేస్తున్న వారు గుర్తించి గాయపడిన ముగ్గురిని ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా పేలుడికి కారణాలు తెలియాల్సి ఉంది.

ఉద్యాన శాఖకు బడ్జెట్ విడుదల

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యాన శాఖకు ఎట్టకేలకు మొదటి క్వార్టర్ బడ్జెట్ విడుదల అయింది. ఎంఐడీహెచ్ కింద జిల్లాకు రూ.1.21 కోట్లు విడుదల అయ్యాయని జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు తెలిపారు. ఇటీవల 'సాక్షి'లో 'ఉద్యాన శాఖకు ఉత్తచెయ్యి' అనే శీర్షికపై కథనం ప్రచురితం అయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రెండు, మూడు నెలలుగా ఊరిస్తున్న మొదటి క్వార్టర్ బడ్జెట్ విడుదల అయింది. పండ్లతోటల విస్తరణకు రూ.35.95 లక్షలు, హైబ్రిడ్ కూరగాయల సాగుకు రూ.21.16 లక్షలు, పూలతోటల సాగుకు రూ.6.27 లక్షలు, 2వ సంవత్సరం నిర్వహణకు రూ.3.61 లక్షలు, 3వ సంవత్సరం నిర్వహణకు రూ.5.83 లక్షలు, మామిడితో పాతతోటల పునరుద్ధరణకు రూ.11.87 లక్షలు, రక్షిత సాగుకు రూ.5.56 లక్షలు, కోత అనంతర మాజమాన్యం కింద రూ.5.70 లక్షలు, ఉద్యాన యాంత్రీకరణ కింద రూ.23.16 లక్షలు, తేనెటీగల పెంపకానికి రూ.56 వేల ప్రకారం బడ్జెట్ విడుదల అయింది. జాతీయ ఆహార నూనెల మిషన్ కింద జిల్లాకు రూ.29.73 లక్షలు, జాతీచ వెదురు మిషన్ కింద రూ.2.08 లక్షలు విడుదల అయ్యాయని జిల్లా ఉద్యాన అధికారి రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పారిశ్రామిక రంగంలో మైనార్టీలకు ఉచిత శిక్షణ

కర్నూలు(హాస్పిటల్): సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్) వారు మైనార్టీలకు పారిశ్రామిక అవసరాలకు సంబంధించి శిక్షణ ఇవ్వనున్నట్లు మైనార్టీల ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నబీహా పర్వీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత వివిధ రంగాల్లో నైపుణ్యాల అభివృద్ధి సాధించడం కోసం ఈ శిక్షణ ఇస్తున్నామన్నారు. మైనార్టీలైన ముస్లింలు, దూదేకుల, క్రిస్టియన్లు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పారశీకులకు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వారికి శిక్షణతో పాటు ట్రెనింగ్ కవర్స్, ట్రాన్స్‌పోర్ట్ స్టేషన్, కెరీర్ కౌన్సిలింగ్, యూనిఫాం, భోజన, వసతితో పాటు స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. ఆసక్తిగల వారు 0866–2571125, 8008879191ను సంప్రదించాలన్నారు.

సత్తా చాటిన జిల్లా క్రికెట్ జట్టు



రాష్ట్ర విజేతగా నిలిచిన క్రికెట్ జట్టును అభినందిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు (టౌన్): ఆంధ్రప్రదేశ్ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గత నెల 31 తేదీన అమలాపురంలో నిర్వహించిన అండర్–14 బాలుర క్రికెట్ అంతర్ జిల్లాల టోర్నమెంటు పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. విజేతలుగా నిలిచిన జట్టును గురువారం కలెక్టర్ పి.రంజిత్ బాషా తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. అలాగే పాట్నాలో నిర్వహించనున్న జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన నలుగురు క్రికెట్ క్రీడాకారులను కలెక్టర్ అభినందించారు. విజేతలుగా నిలిచిన క్రికెట్ జట్టు క్రీడాకారులను జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్ పాల్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో కర్నూలు జట్టు రాణించడం హర్షించదగ్గ విషయమన్నారు. జాతీయ స్థాయిలోనూ జిల్లా క్రీడాకారులు జిల్లా కీర్తిని చాటాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి గిడ్డయ్య, కోచ్ మేనేజర్ శేఖర్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నేతల దాడి





గాయపడిన పెద్ద దానమ్మ, చిన్నదానమ్మ, గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శేషన్న

మహానంది: మండలం మసీదుపురం గ్రామంలో నూతన సంవత్సరం సందర్భంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తపై టీడీపీకి నాయకులు దాడి చేసిన ఘటన గురువారం రాత్రి మండలంలోని మసీదుపురం గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు గ్రామంలో నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని బ్యానర్లు ఏర్పాటు చేశారు. అయితే అధికార పార్టీకి చెందిన రాజేష్, ఓబులేసు, శేఖర్ తదితరులు దీనిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దాడికి దిగారు. ఈ దాడిలో వైఎస్సార్‌సీపీకి చెందిన చిన్న దానమ్మ, పెద్ద దానమ్మ, నరసింహులు మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని కుటుంబసభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. టీడీపీకి చెందిన వారు వైఎస్సార్‌సీపీ నాయకులపై రాళ్లతో దాడి చేసినట్లు గ్రామ ఎంపీటీసీ మల్లికార్జున రెడ్డి తెలిపారు. గ్రామంలో పోలీసులు వచ్చినప్పటికీ మహిళలని చూడకుండా దాడి చేశారని, గ్రామ ప్రజలకు భయభ్రాంతులకు గురిచేశారని, గతంలోనూ వైఎస్సార్ సీపీ అభిమానులపై దాడికి పాల్పడ్డారని చెప్పారు. ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి గ్రామానికి చేరుకొని ఘటనపై విచారణ చేపట్టారు.

టీటీడీ ట్రస్ట్‌బోర్డులో బంజారాలకు అన్యాయం



మాట్లాడుతున్న లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కైలాష్‌నాయక్

శ్రీశైలంటెంపుల్: తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డులో బంజారాలకు స్థానం కల్పించకుండా కూటమి ప్రభుత్వం అన్యాయం చేసిందని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఆర్.కైలాష్ నాయక్ ఆరోపించారు. గురువారం శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అతిథి గృహంలో ఆయన మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా 12 కోట్ల మంది బంజారాలు మాట్లాడే గోర్‌బోలీ భాషకు రాజ్యాంగ హోదా కల్పించేలా రాష్ట్రాలు అసెంబ్లీలో తీర్మానాలు చేసి పార్లమెంట్‌కు పంపాలని డిమాండ్ చేశారు. శ్రీశైలంలో బంజారాలకు సత్రం నిర్మాణానికి స్థలం కేటాయించాలన్నారు. నూతనంగా ఏర్పడే శ్రీశైల దేవస్థానం ట్రస్ట్‌బోర్డులో స్థానిక బంజారాలకు చోటు కల్పించాలన్నారు. శ్రీశైలంలో చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహించుకునేందుకు స్థానిక బంజారాలకు అవకాశాలు కల్పించాలన్నారు. సమావేశంలో నాయకులు శుక్రనాయక్, హనుమాన్‌నాయక్, మల్లికార్జుననాయక్, కృష్ణానాయక్ పాల్గొన్నారు.

మహిళపై దాడి.. ఇద్దరిపై కేసు నమోదు

ఓర్వకల్లు: భర్తతో వివాహేతర సంబంధం పెట్టుకుందని ఓ వితంతు మహిళపై దాడి చేశారు. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సునీల్ కుమార్ తెలిపారు. మండలంలోని హుసేనాపురం గ్రామానికి చెందిన ఓ మహిళ భర్త అనారోగ్యంతో ఏడాది క్రితం చనిపోయాడు. కాగా వితంతు మహిళ చనువుగా వుంటూ తన భర్త రామకృష్ణతో వివాహేతర సంబంధం పెటుకున్నట్లు అతని భార్య సుజాత అనుమానం పెంచుకుంది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం వెల్దుర్తి మండలం, గోవర్ధనగిరికి చెందిన సుజాత బంధువు మహేష్ అలియాస్ మహి అనే హిజ్రాను హుసేనాపురం గ్రామానికి పిలిపించింది. పథకం ప్రకారం వితంతు మహిళను ఇంటి వద్దకు పిలిపించుకుని మూకుమ్మడిగా దాడి చేశారు. ఆ తర్వాత స్తంభానికి కట్టేసి, గుండు గీయించే యత్నం చేశారు. స్థానికులు గుర్తించి అడ్డుకున్నారు. కాగా అవమాన భారంతో వితంతు మహిళ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు సుజాత, మహిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డీఆర్‌యూసీసీగా విజయకుమార్‌రెడ్డి



విజయకుమార్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (డీఆర్‌యూసీసీ) హైదరాబాద్ డివిజన్, సౌత్ సెంట్రల్ రైల్వేగా కర్నూలుకు చెందిన ఐ. విజయకుమార్‌రెడ్డి నియమితులయ్యారు. చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా చైర్మన్‌గా ఉన్న ఈయన డీఆర్‌యూసీసీగా రెండేళ్ల పాటు పనిచేస్తారు. రైల్వే స్టేషన్‌లో ఏమైనా అభివృద్ధి పనులు, రైళ్లలో సౌకర్యాలు, కర్నూలు మీదుగా ఏమైనా కొత్తగా రైలు అవసరాలు ఉంటే ప్రజలు తనను సంప్రదించాలని ఆయన కోరారు.

ఆత్మకూరు వైద్య విద్యార్థికి నిమ్హాన్స్‌లో సీటు



తేజ్ కుమార్ గౌడ్

ఆత్మకూరు రూరల్: బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్‌లో ఆత్మకూరుకు చెందిన వైద్య విద్యార్థి బుసగౌని తేజ్‌కుమార్‌గౌడ్‌కు సీటు వచ్చింది. ఐఎన్‌ఐ సూపర్ స్పెషాలిటీ ఎంట్రెన్స్ టెస్ట్‌లో ఆల్ ఇండియా నాల్గవ ర్యాంక్ సాధించడంతో ప్రతిష్టాత్మకమైన నిమ్హాన్స్‌లో న్యూరో సర్జరీలో సూపర్ స్పెషాలిటీ సీట్ వచ్చిందని తేజ్‌కుమార్ గౌడ్ తెలిపారు. కాగా తేజ్‌కుమార్‌గౌడ్ పాండిచ్చేరి జిప్‌మర్‌లో ఎంబీబీఎస్, పీజీ చేశారు. వైద్య విద్యార్థిని పలువురు అభినందించారు.

నేటి నుంచి సీసీఐ పత్తి కొనుగోలు నిలుపుదల

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆయా ఫ్యాక్టరీల్లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో శుక్రవారం నుంచి ఈనెల 5వ తేదీ వరకు పత్తి కొనుగోలు నిలుపుదల చేస్తున్నట్లు సీసీఐ ఇన్‌చార్జ్‌లు భరత్, గౌతమ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి నిల్వలు ఎక్కువగా ఉండడంతో మూడు రోజులపాటు తాత్కాలికంగా కొనుగోలు నిలుపుదల చేస్తున్నామని తెలియజేశారు. పత్తి దిగుబడుల రైతులు ఈ విషయాన్ని గమనించి అధికారులకు సహకరించాలన్నారు.

పురుష లెక్చరర్లు మాకొద్దు

- లైంగిక వేధింపులు భరించలేకపోతున్నాం
- ప్రాక్టికల్స్‌లో మార్కులు తగ్గిస్తామంటున్నారు
- రోడ్డెక్కి 'బనవాసి' విద్యార్థినుల ధర్నా



ధర్నాకు దిగిన విద్యార్థినులు, విద్యార్థి సంఘాల నాయకులతో మాట్లాడుతున్న రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు

ఎమ్మిగనూరురూరల్: బనవాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీలో పనిచేస్తున్న పురుష లెక్చరర్లు మాకొద్దంటూ విద్యార్థినులు గురువారం కాలేజీ దగ్గర జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. పురుష లెక్చరర్ల తీరుతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడిన మద్దిలేటిపై చర్యలు తీసువాలని డిమాండ్ చేశారు. మహిళా లెక్చరర్లు, ప్రిన్సిపాల్ కావాలని కోరారు. ప్రస్తుతం ఉన్న ప్రిన్సిపాల్‌కు, పురుష లెక్చరర్లకు వత్తాసు పలుకుతున్న పీఈజీ సుకన్యను కూడా తొలగించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు సంఘటన స్థలానికి వెళ్లి విద్యార్థినులతో మాట్లాడారు. లైబ్రేరియన్‌పై కేసు నమోదు చేశామని, విద్యార్థినుల సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎస్‌ఐ చెప్పడంతో విద్యార్థినులు కాలేజీకిలోకి వచ్చారు. కాగా.. కాలేజీలో విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన లైబ్రేరియన్ కురవ మద్దిలేటిపై పోక్సో యాక్ట్ కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు గురువారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. విద్యార్థినుల ధర్నాకు విద్యార్థి సంఘాల నాయకులు రాజేష్, వీరేష్, మహేంద్రబాబు, శేఖర్, ఉదయ్, విజేంద్ర, సురేంద్ర, హుసేని, రంగప్ప, సురేష్, ఆఫ్రిది, రఘునాథ్, నల్లారెడ్డి సంఘీభావం తెలిపారు.

కాలేజీలో జరిగిన విషయం ఇదీ..

బనవాసి ఏపీ గురుకుల జూనియర్ కాలేజీలో రాయలసీమ జిల్లాల చెందిన విద్యార్థినులు చదువుతున్నారు. ఇక్కడ పనిచేసే కొందరి లెక్చరర్ల దుష్టచేష్టలతో విద్యార్థినులకు రక్షణ కరువైంది. కొందరు విద్యార్థినులు ధైర్యం తెచ్చుకొని లెక్చరర్ల బాగోతాన్ని ప్రిన్సిపాల్ శ్రీనివాసగుప్త దృష్టికి తీసుకెళ్లారు. అయితే ఆయన స్పందించకపోగా పురుష లెక్చరర్లకు వత్తాసు పలుకుతున్నాడని గుర్తించారు. ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని విషయాన్ని దూర ప్రాంతంలో ఉన్న కుటుంబ సభ్యులకు బోరున విలపిస్తూ చెప్పారు. కాలేజీకి వచ్చిన విద్యార్థిని కుటుంబ సభ్యులు లైంగిక వేధింపులకు పాల్పడిన లైబ్రేరి యన్ మద్దిలేటితో పాటు వారికి వత్తాసు పలికిన ప్రిన్సిపాల్ శ్రీనివాసగుప్తను చితకబాది, కాలేజీ మా కొద్దంటూ టీసీ తీసుకొని వెళ్లిపోయారు.

